క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం

కోట: విద్యార్థులు చదువుతో పాటు చట్టాలు, రాజ్యాంగం ప్రసాదించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని కోట జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్ అన్నారు. శనివారం కోట ఎస్సీ బాలికల వసతిగృహంలో న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా విద్యార్థులకు పలు అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. చట్టాలు, హక్కుల గురించి వివరించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.

27న సామాజిక తనిఖీ ప్రజావేదిక

గూడూరురూరల్: ఉపాధి హామీ పథకానికి సంబంధించి సామాజిక తనిఖీ ప్రజా వేదికను ఈ నెల 27వ తేదీ ఉదయం 9 గంటలకు గూడూరు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులకు సంబంధించి 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికలో వివరాలు వెల్లడిస్తామన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మండల అధికారులు హాజరుకావాలని కోరారు.

అడ్మిషన్‌లకు గడువు పొడిగింపు

నాయుడుపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందేందుకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదన్‌వర్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో బీఏ హానర్స్ పొలిటికల్ సైన్స్, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ హానర్స్ కెమిస్ట్రీ, కంప్యూటర్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జూలై 5వ తేదీ వరకు గడువు పొడిగించామన్నారు. ఆన్‌లైన్‌లో అడ్మిషన్‌లు పొందవచ్చన్నారు.

డిప్లొమా అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు

గూడూరురూరల్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డిప్లొమా(పాలిటెక్నిక్)లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ శ్యామ్ మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయుడుపేటలోని ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ ఏపీఎల్ హెల్త్ కేర్ లిమిటెడ్(అరబిందో)లో ఉద్యోగాలకు ఈనెల 27వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు గూడూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు http://rb.gy/9miut లింక్‌లో తప్పనిసరిగా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8143576866 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఓజిలి: మండలంలోని మానమాల గ్రామంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదివారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుంటమడుగు రవీంద్రరాజు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానికుల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

ఎంఈఓ బాధ్యతల స్వీకరణ

కోట: కోట ఇన్‌చార్జ్ ఎంఈఓ–1గా శైలజ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఓజిలి మండలం ఎంఈఓగా ఉన్న ఆమె కోట ఇన్‌చార్జ్ ఎంఈఓగా నియమితులయ్యారు. ఈ క్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆమెకు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

సూళ్లూరుపేట: పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 500 మార్కులకు పైగా సాధించిన పదో తరగతి విద్యార్థులకు స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఆచార్య భరద్వాజ సేవా సంస్థ శనివారం నగదు బహుమతులను అందజేసింది.

రైతు నేస్తం



రైతు దుక్కి దున్ని.. ఆరుగాలం శ్రమిస్తేనే పది మందికి పట్టెడన్నం దొరుకుతుంది. అలాంటి అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తూ..వ్యవసాయ రంగ అభివృద్ధికి వెన్నుతడుతోంది. పల్లె వాకిటకు రైతు సేవలను తీసుకొచ్చింది. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి సకల సదుపాయాలు కల్పిస్తోంది. విత్తు నుంచి పంట చేతికొచ్చే వరకు కేంద్రాల ద్వారా సహాయ సహకారాలు అందిస్తోంది.

- రైతు భరోసా కేంద్రాల ద్వారా పల్లె వాకిటకు సేవలు
- విత్తనం నుంచి విక్రయం వరకు భరోసా
- అన్నదాతలకు అవసరమయ్యే సేవలన్నీ ఒకే చోట
- వ్యవసాయ రంగంలో సమూల మార్పులు



రైతులకు ఎరువులు అందిస్తున్న అధికారులు



రైతు గ్రూపు సభ్యులకు ట్రాక్టర్ అందిస్తూ..

రాపూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు నేస్తాలుగా మారాయి. విత్తనాలు, ఎరువుల సరఫరా నుంచి పంట ఉత్పత్తులను పెంచడం, సాగులో నష్టాలను తగ్గించడం, పంట విక్రయం వరకు అండగా ఉంటున్నాయి. మండలంలో 18 సచివాలయాలు ఉన్నాయి. వాటికి అనుసంధానంగా 18 ఆర్‌బీకేలు పనిచేస్తున్నాయి.

- **రైతులకు అందుబాటులో సేవలు**

ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను అందిస్తోంది. నాణ్యమైన ఎరువులు, విత్తనాలను వారి ఇంటి ముంగిటకే అందిస్తోంది. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. సొసైటీల వద్ద గంటల తరబడి క్యూలో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. ఆర్‌బీకేల ఏర్పాటుతో రైతులకు వ్యయ ప్రయాసలు తప్పాయి. రైతులు ఆర్బీకేలోని కియోస్క్‌లో నమోదు చేసుకుని నగదు చెల్లిస్తే బహిరంగ మార్కెట్‌లో కన్నా తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు స్థానికంగా అందుతున్నాయి. పంట ఉత్పత్తులను సైతం ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేస్తూ గిట్టుబాటు ధర కల్పిస్తోంది. రైతు గ్రూపులకు అవసరమైన ట్రాక్టర్లు, వరికోత మెషిన్లు తదితర యంత్ర పరికరాలను రాయితీపై అందజేస్తోంది.

- **పంట సాగుపై అవగాహన**

ఆర్‌బీకేల ద్వారా రైతులకు పంట సాగుపై క్షేత్ర స్థాయిలో సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు ఆర్‌బీకేల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. క్షేత్ర సందర్శన ద్వారా రైతులకు సూచనలు, సలహాలు అందిస్తూ అండగా నిలుస్తున్నారు. అలాగే తృణ ధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నారు. ఇందు కోసం రైతులకు విత్తనాల కిట్లను పంపిణీ చేస్తున్నారు.

- **యాంత్రీకరణకు ప్రోత్సాహం**

వ్యవసాయ యాంత్రీకరణకు ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా వైఎస్సార్ యంత్రసేవ పథకానికి దరఖాస్తు చేసుకోవడంతో మండలంలోని 14 గ్రూపులకు రూ.52 లక్షల విలువ చేసే 8 ట్రాక్టర్లు, రూ.31 లక్షల విలువ చేసే వ్యవసాయ పరికరాలు 72 రాయితీపై పొందారు.

రాపూరు మండలంలోని వివరాలు	
ఆర్‌బీకేలు	: 18
ఆర్‌బీకే పరిధిలో గ్రామాలు	: 39
సేవలు పొందుతున్న రైతులు	: 26 వేల మంది
పంపిణీ చేసిన ఎరువులు	: 550 మెట్రిక్ టన్నులు
విత్తనాలు	: 800 క్వింటాళ్లు
రైతు గ్రూపులు	: 14
సభ్యులు	: 70
పంపిణీ చేసిన ట్రాక్టర్లు	: 8
వ్యవసాయ పరికరాలు	: 72

- **పీఎం కిసాన్‌కు ఈకేవైసీ**

మండలంలో పీఎం కిసాన్ పథకానికి సంబంధించి కొందరికి వేలిముద్రలు పడక ఇబ్బందులు పడ్డారు. అలాంటి 250 మంది వృద్ధ రైతులకు ఫేషియర్ యాప్ ద్వారా ఈకేవైసీ చేయించారు. రైతులకు వ్యవసాయానికి ఏడాదికి రూ.6 వేలు బ్యాంకు ఖాతాలో జమ అవుతోంది.

- **ఒకే చోట అనుబంధ శాఖల సిబ్బంది**

రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయం, ఉద్యానవనం, పశువర్ధకశాఖ సహాయకులు అందుబాటులో ఉంటున్నారు. దీంతో అన్ని రకాల సేవలు రైతులకు ఒకేచోట అందుతున్నాయి. గతంలో ఎలాంటి సహాయం కావాల్సి వచ్చినా సలహాలకు రైతులు అవస్థలు పడేవారు. ఇప్పుడు అన్ని శాఖల సిబ్బంది రైతు భరోసా కేంద్రాల్లో ఉండడం వల్ల సకాలంలో సేవలు అందుతున్నాయి.

ఆర్‌బీకేలతో ప్రయోజనం



ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. గతంలో రాపూరు, పొదలకూరు, నెల్లూరు ప్రాంతాలకు వెళ్లి ఎరువులు, విత్తనాలు ఆటోలో వేసుకుని వచ్చేవాళ్లం. నేడు ఆర్‌బీకేల్లోనే మాకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు తక్కువ ధరకే దొరుకుతున్నాయి. చాలా సంతోషంగా ఉంది.
–గోపిరెడ్డి రవీంద్రారెడ్డి, ఏపూరు, రాపూరు

పెట్టుబడులు తగ్గాయి



ఆర్‌బీకేల ఏర్పాటుతో వ్యవసాయానికి పెట్టుబడులు తగ్గాయి. అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తున్నాం. భూసార పరీక్షలు చేసి అందుకు అనుగుణంగా పంట సాగు చేస్తున్నాం. అకాల వర్షాలకు పంట నష్టం జరిగితే వెంటనే పరిహారం అందుతోంది. ప్రభుత్వం అందించే యంత్రాలతో వ్యవసాయ రంగానికి మరింత మేలు జరుగుతోంది. –చల్లా పుల్లయ్య, గుండవోలు

రైతులకు ఎంతో ఉపయోగం



ఆర్‌బీకేలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో పాటు వ్యవసాయ పరికరాలను ఇంటి ముంగిటకే అందజేస్తున్నాం. ఆధునిక, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నాం. మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షల ద్వారా రైతులు వాడాల్సిన ఎరువుల మోతాదు వివరాలు తెలియజేస్తున్నాం. –సోమసుందరం, ఏఓ

లలిత జ్యువెలరీ షోరూంల ప్రారంభం



సూళ్లూరుపేట: లలిత జ్యువెలరీ నగల దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



గూడూరులో షోరూం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

సూళ్లూరుపేట: పట్టణంలో లలితా జ్యువెలరీ 48వ షోరూంను సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శనివారం ప్రారంభించారు. నాణ్యమైన బంగారు ఆభరణాలను సామాన్యులకు సరసమైన ధరలకు అందించి ప్రజల ఆదరాభిమానాలు అందుకుంటున్న లలిత జ్యువెలరీ సూళ్లూరుపేటలో ప్రారంభించినందుకు షాపు యజమాని ఎం.కిరణ్ కుమార్‌ను అభినందించారు. నెల్లూరులో పుట్టి పెరిగిన తాను ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని సూళ్లూరుపేటలో 48, గూడూరులో 49, నెల్లూరులో 50 బ్రాంచ్ ప్రారంభించడం సంతోషంగా ఉందని కిరణ్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, వైస్ ఛైర్మన్లు పద్మ మిల్టన్, చిన్ని సత్యనారాయణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గూడూరు: పట్టణంలోని హాస్పిటల్ రోడ్డులో లలిత జ్యువెలరీ 49వ షోరూమ్‌ను గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ షోరూం అధినేత కిరణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



నెల్లూరులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీలు వేమిరెడ్డి, అదాల

నెల్లూరులో 50వ షోరూం

నెల్లూరు(బృందావనం): స్వర్ణాభరణాల విక్రయాల్లో దక్షిణ భారతదేశంలో ప్రముఖమైనదిగా గుర్తింపు తెచ్చుకున్న లలితా జ్యువెలరీ 50వ షోరూం నెల్లూరు నగరంలోని మినీబైపాస్ రోడ్డులో శనివారం ప్రారంభమైంది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకనాథ్, డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు.

నేడు పూర్వ విద్యార్థుల సమావేశం

వెంకటగిరి: పట్టణంలోని విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులతో ఆదివారం సమావేశం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ అరుణ్ కుమార్ తెలిపారు.

చెంగాళమ్మను దర్శించుకున్న హైకోర్టు జడ్జి



ఆలయంలో న్యాయమూర్తి సుజాతకు తీర్థప్రసాదాలను అందజేస్తున్న అధికారులు

సూళ్లూరుపేట/తడ: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వి.సుజాత శనివారం సూళ్లూరుపేట పట్టణంలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి, తడ మండలం ఇరకం దీవిలో వెలసిన పొన్నియమ్మన్ ఆలయాలను సందర్శించారు. ఆమెకు చెంగాళమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ఆర్డీఓ చంద్రముని రణాల్, తహసీల్దార్ రవికుమార్ స్వాగతం పలికారు. అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆమె వెంట ఏసీబీ–1 జడ్జి జయలక్ష్మి, సూళ్లూరుపేట జూనియర్ సివిల్ జడ్జి న్యాయమూర్తులు అనిల్‌కుమార్, అనూష, తడ తహసీల్దార్ కటారి జయజయరావు, ఎస్‌ఐ జేపీ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

పేదలకు బియ్యం బస్తాల అందజేత

దొరవారిసత్రం: నెలబల్లి గ్రామ పరిధిలోని ఎస్టీ కాలనీలో పేద కుటుంబాలకు తడ కండ్రిగకు చెందిన శ్రీకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం బియ్యం బస్తాలు అందజేశారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన దాత శ్రీనివాసులు సహకారంతో బియ్యం బస్తాలు అందజేసినట్లు సంస్థ నిర్వాహకుడు నాగరాజు తెలిపారు.

మంచి జరిగిందనిపిస్తే ఆదరించండి



పేర్నాడులో వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరించి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య
- పేర్నాడులో గడప గడపకు మన ప్రభుత్వం

సూళ్లూరుపేట రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంచి జరిగిందని అనిపిస్తే మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సూళ్లూరుపేట మండలం కడపత్ర పంచాయతీ పరిధిలోని పేర్నాడు, తోటకట్ల గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. రెండు గ్రామాల్లో సుమారు 400 కుటుంబాలను కలుసుకున్నారు. వారికి అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ బావుటా బెక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ లక్ష నుంచి రూ. 10 లక్షల వరకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం మంచి చేస్తోందని.. మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. స్థానికులు సైతం తమకు జగనన్న విద్యాదీవెన, అమ్మ ఒడి, సున్నావడ్డీ, వైఎస్సార్ పింఛన్ కానుక, ఇంటి స్థలం, చేదోడు, చేయూత వంటి పథకాలు అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. మళ్లీ జగనన్నే రావాలి అనే ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు జెట్టి వేణుయాదవ్, రామకృష్ణారెడ్డి, తుపాకుల ప్రసాద్, ఎంపీటీసీ అరుణమ్మ, గొంజి ఆనంద్, పెదపాపు రామ్మోహన్, కట్టా మురళీ, కట్టా మధు, చిలకా వెంకటకృష్ణయ్య, యుగంధర్, వెంకటేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

గూడూరు: జగనన్న సురక్ష పథకం ద్వారా సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని, వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని కార్యక్రమ లక్ష్యాన్ని పూర్తి చేయాలని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. స్థానిక డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో పట్టణంలోని సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. వలంటీర్‌లు ప్రతి ఇంటికి వెళ్లి అర్హులై ఉండి సంక్షేమ పథకాలు రాకపోతే వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. పరిష్కారం కాని సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కమిషనర్ సాయినాథ్, డీఎల్‌డీఓ వాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

ఉద్యమంగా చేయాలి

బాలాయపల్లి (శ్రీకాళహస్తి): జగనన్న సురక్ష పథకం విజయవంతం చేసేందుకు సచివాలయం సిబ్బంది, వలంటీర్లు ఉద్యమంగా పనిచేయాలని ఎంపీడీఓ రవీంద్రబాబు అన్నారు. శనివారం బాలాయపల్లి మండలం మన్నూరు సచివాలయంలో జగనన్న సురక్ష పథకం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటిని వలంటీర్లు, సచివాలయం సిబ్బంది సందర్శించి వారికి కావాల్సిన సర్టిఫికెట్లు, సేవలను అందించాలని ఆదేశించారు.

వివరాలను నమోదు చేయాలి

వెంకటగిరిరూరల్: జగనన్న సురక్ష వివరాల నమోదు వేగవంతం చేసేలా ఇన్‌చార్జి అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఓ విజయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లు, ప్రభుత్వ పథకాల లబ్ధిలో జాప్యం ఎదుర్కొంటున్న ప్రజలకు వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే చేరుకుని సమస్య వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వారికి ఆయా సచివాలయాల ద్వారా ఉచితంగా సర్టిఫికెట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

నెలబల్లిలో..

దొరవారిసత్రం: నెలబల్లి గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలను నమోదు చేశారు.

సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

సైదాపురం: ప్రజల సమస్యలను గుర్తించి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే జగనన్న సురక్ష పథకం లక్ష్యమని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని అనంతమడుగు, చాగణం రాజుపాళెం గ్రామాల్లో జగనన్న సురక్ష పథకంపై సర్వే చేశారు. మండలంలోని 19 గ్రామ సచివాలయాల్లో ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

కోట: జగనన్న సురక్షతో గ్రామాల్లో సమస్యలను సత్వరమే పరిష్కరించనున్నట్లు గూడూరు డీఎల్‌పీఓ వెంకటరమణ తెలిపారు. మండలంలోని కొక్కుపాడులో శనివారం అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. ఎంపీడీఓ భవానీ, ఈఓపీఆర్డీ కిరణ్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఈఈ

గూడూరురూరల్: విద్యతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని.. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని నెల్లూరు పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ ఈఈ శ్రీనివాసులురెడ్డి అన్నారు. గూడూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శనివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహంతో పాటు మెడల్స్‌ను అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు చొప్పున అందజేశారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ దాతృత్వంతో 30 మంది విద్యార్థులకు మెడల్స్‌తో పాటు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. గూడూరు పంచాయతీరాజ్ ఈఈ గిరినాథ్, కల్యాణసాయి, మురళీరెడ్డి, డీఈలు రవీంద్రకుమార్, రామచంద్రయ్య, కృష్ణబాబు పాల్గొన్నారు.

ఎర్ర దుంగలు స్వాధీనం

రాపూరు: వెలుగొండల నుంచి అక్రమంగా కారులో తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఇద్దరి అరెస్టు చేసినట్లు గోనుపల్లి డీఆర్‌ఓ మస్తాన్ తెలిపారు. రాపూరు అటవీశాఖ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. శుక్రవారం రాత్రి రాపూరు మండలం తెగచర్ల గ్రామ సమీపంలోని తాటిచెట్ల వాగుబాట వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారు వచ్చిందన్నారు. తనిఖీ చేయగా అందులో 10 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వాటి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని తెలిపారు. కారును, ఎర్రచందనం దుంగలను ఆదురుపల్లి ఎర్రచందనం గోదాముకు తరలించినట్లు తెలిపారు. తమిళనాడుకు చెందిన బాలాజీ, సెల్వంను అదుపులోకి తీసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. దాడుల్లో స్క్వాడ్ వరప్రసాద్, శ్రీనివాసులు, బాలచెన్నయ్య ఉన్నారు.

సభ్యత్వాలను రెన్యూవల్ చేసుకోండి

చిల్లకూరు: మత్స్యశాఖ ద్వారా ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని మత్స్యశాఖాధికారులు మత్స్యకార సొసైటీ సభ్యులకు సూచించారు. మండలంలోని తిక్కవరం గ్రామంలో శనివారం సొసైటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎఫ్‌డీఓ రఘుబాబు మాట్లాడుతూ.. పలు చెరువులకు సంబంధించి సొసైటీలు ఏర్పాటు చేశారని.. అయితే సభ్యత్వాలను రెన్యూవల్ చేసుకోకపోవడంతో ప్రభుత్వ రాయితీలు పొందలేకపోతున్నారని తెలిపారు. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యశాఖ ద్వారా మోపెడ్‌లు, ఐస్ బాక్స్‌లు, వలలు అందించేందుకు ముందుకు వచ్చిందని, అయితే సొసైటీలో సభ్యత్వం ఉన్నవారు అర్హులు కావడంతో ఎక్కువ మందిని ఎంపిక చేయలేకపోయామని అన్నారు. ప్రతి ఒక్కరు సొసైటీలను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

చిల్లకూరు: కలవకొండ గ్రామంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. నెల్లూరుకు చెందిన నెలవాయి, గోపిరెడ్డి, బారతీ మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకీ సేవ జరిగింది.